క్లుప్తంగా

ఎస్ఐకు సన్మానం



ఎస్ఐగా పదోన్నతి పొందిన సూర్యనారాయణను సన్మానిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం సర్కిల్ కార్యాలయంలో ఏఎస్ఐగా పనిచేస్తూ ఎస్ఐగా పదోన్నతి పొందిన సూర్యనారాయణను వాల్మీకి సంఘం నాయకులు సత్కరించారు. ఆదివారం ఆయన స్వగృహంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు గోవిందు, యూత్ అధ్యక్షుడు తలారి చరణ్, యూత్ ఉపాధ్యక్షుడు పశువుల సునీల్, పూజారి మంజు, తలారి శ్రీకాంత్, సుధాకర్, చిరంజీవి, కళ్యాణ్, పృథ్వీ, దొడగట్ట మురళి, సురేష్‌కుమార్ సన్మానించారు.

బిల్లులు అందక ఉపాధి కూలీల అవస్థలు



అరవకూరులో ఫారంపాండ్ పనులు చేస్తున్న కూలీలు

కూడేరు: మండలంలో ఉపాధి కూలీలకు బిల్లులు అందక అవస్థలు పడుతున్నారు. 8,491 పని దినాలకు గాను రూ.98,98,659 బిల్లు పెండింగ్ ఉంది. మే 15న చివరిగా కూలీల ఖాతాల్లోకి బిల్లులు జమఅయ్యింది. పెండింగ్ బిల్లులను వెంటనే ఇవ్వాలని కూలీలు కోరుతున్నారు.దీనిపై ఏపీఓ పోలేరయ్యను అడగ్గా చేసిన పనులకు కొలతలు తీసి బిల్లులు పెట్టాం.. నిధులు మంజూరు అయిన వెంటనే బిల్లులు ఇస్తామన్నారు. వారం రోజుల్లోపు బిల్లు వచ్చే అవకాశముందన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే దారిలో చేతికి అందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసన్న వేంటకరమణస్వామి, జంబుకేశ్వర స్వామి ఆలయాలకు వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్, దానికి అమర్చిన ఫ్యూజు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. మూడు అడుగుల ఎత్తులో చిన్నపిల్లలకు అందే ఎత్తులో ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో పాటు తీగల ఎత్తును పెంచాలని పలుమార్లు విద్యుత్‌శాఖ అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకోలేదని కాలనీవాసులు చెబుతున్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



ఎర్రబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

రాయదుర్గంటౌన్: ఆర్టీసీ స్థలాలను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ ఉద్యోగులు ఎర్రబ్యాడ్జీలతో ఆదివారం విధులకు హాజరై నిరసన తెలిపారు. ఎస్ఎంయూఏ సభ్యులు తెల్లవారుజాము 5 గంటల నుంచే ఎర్రబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఎస్ఎంయూఏ డిపో కార్యదర్శి తిప్పేస్వామి మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డున విలువైన ఆర్టీసీ స్థలాలను షాపింగ్ మాల్ కోసం బహుళజాతి సంస్థలకు కేటాయించాలనే ప్రతిపాదలను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రయాణికుల భవిష్యత్తు, రవాణా అవసరాలకు ఉపయోగపడే ఆర్టీసీ స్థలాలను అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

గుట్టుగా కందుల పంపిణీ

కుందుర్పి: మండలానికి మంజూరైన 28 క్వింటాళ్ల ఉచిత కందులు అధికార పార్టీ కనుసన్నుల్లో గుట్టుగా పంపిణీ చేయడమేమిటని రైతులు వ్యవసాయాధికారులను నిలదీస్తున్నారు. కుందుర్పి మినహా ఎక్కడా బహిరంగంగా పంపిణీ చేయలేదని రైతుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. తాను చెప్పిన వారికే కందులు పంపిణీ చేయాలని ఏఈఓ కులశేఖర్‌ను అధికార పార్టీ నాయకుడు గోపాల్ హుకుం జారీ చేసిన విషయం తెలిసిందే. ఆయా గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న ఏఈఓలు బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం వల్లే ముందు ఆయా గ్రామాల టీడీపీ ముఖ్య నాయకులకు కందులను అప్పగించి వెళ్లినట్లు రైతులు చర్చించుకుంటున్నారు. ఈవిషయమై ఏఓ విజయ్‌కుమార్ అడగ్గా, ఇప్పటికే 90 శాతం కందులు రైతులకు ఉచితంగా పంపిణీ చేశామని, నేరుగా అర్హులకు అందజేశామని తెలిపారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

వజ్రకరూరు: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఈనెల 29న ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ శివాజీరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఆడబిడ్డ నిధి..ఎప్పుడిచ్చేది?

- ఎన్నికల సమయంలో సూపర్‌సిక్స్ హామీల్లో ఒకటిగా ఇంటింటా ప్రచారం
- ప్రతి మహిళకూ నెలకు రూ.1500 ఇస్తామని హామీ
- నేడు ఆ పథకం ఇవ్వాలంటే ఆంధ్రాను అమ్మాలంటున్నారు
- దుమారం రేపుతున్న మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలు



రాయదుర్గం: ఎన్నికల సమయంలో కూటమి నేతలు సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన 'ఆడబిడ్డ నిధి'పై అందరిలోనూ అయోమయం నెలకొంది. తాము అధికారంలోకొస్తే ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోని 19 నుంచి 59 ఏళ్ల మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున ఏడాదికి రూ.18 వేలు, ఇంట్లో ఎంత మంది ఉంటే అందరికీ వర్తింపజేస్తామని కూటమి నేతలు ఊరూవాడా ఊదరగొట్టారు. అయితే ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు ' పథకం అమలు చేయాలంటే నిధులు లేవని, ఆంధ్రాను కూడా అమ్మాల్సి వస్తుందని ' చేసిన వ్యాఖ్యలు దుమారం లేపుతున్నాయి. దీనిపై కూటమి నేతలు ఊసెత్తడంలేదు.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో సుమారు 3,43,015 మందికి ప్రతి నెల రూ.1500 ప్రకారం రూ.51.45 కోట్లు ఇవ్వాలి. గడిచిన 13 నెలలుగా లెక్కిస్తే రూ.668.85 కోట్లు బకాయిలు చెల్లించాలి. నిబంధనలు లేకపోతే ఈ సంఖ్య మరింత పెరుగుతుంది. బడ్జెట్‌లోనూ రూ.3,341 కోట్లు కేటాయించామంటూ చెప్పుకుంటున్నా సరైన విధివిధానాలు ఖరారు చేయలేదు. ఈ పరిస్థితుల్లో ఆడబిడ్డ నిధి అమలు చూయాలంటే .. ఆంధ్రాను అమ్మాల్సిందేనంటూ మంత్రి అచ్చెన్న చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర వ్యాప్తంగా దుమారం రేపుతున్నాయి. మహిళల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఏరుదాటక తెప్ప తగలేసే రకం అంటే ఇదేనని చర్చించుకుంటున్నారు. 2014 ఎన్నికల్లోనూ ఇలాగే అమలుకు సాధ్యం కాని 610 తప్పుడు హామీలిచ్చి మోసం చేశారని నిట్టూరుస్తున్నారు.

రాష్ట్రాన్ని అమ్మేయాలనడం సిగ్గుచేటు



ఆడబిడ్డ నిధిపై మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు సరైనవికాదు. పథకం అమలుకు రాష్ట్రాన్ని అమ్మేయాలనడం సిగ్గుచేటు. ఆడబిడ్డనిధి అమలు చేయలేమని చేతులెత్తేస్తే కూటమి దగా కోరు పాలనకు నిదర్శనం. పథకం ఇచ్చే వరకు ప్రజల తరపున పోరాటం సాగిస్తాం.

– లుబ్నా గజాల, 27వ వార్డు కౌన్సిలర్, రాయదుర్గం

ఆడబిడ్డ నిధి ఎగ్గొట్టే ప్రయత్నం..



ఎన్నికల్లో చెప్పిన హామీ మేరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోని 19 నుంచి 59 మధ్య ఉన్న వారందరికీ ప్రతి నెలా రూ.1500 ప్రకారం చెల్లించాలి. ఇప్పటికే పాలనా పగ్గాలు చేపట్టి 13 నెలలు కావస్తున్నా 13 పైసలు కూడా ఇవ్వలేదు. మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు చూస్తుంటే ... ఆడబిడ్డ నిధి ఎగ్గొట్టేలా కనిపిస్తోంది. ఈ పథకం అమలు చేయకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో మహిళలతో కలసి ఉద్యమానికి శ్రీకారం చుడతాం.

– కోకూర్తి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి

మహిళల ఎదురుచూపు



ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల్లోని 19–59 ఏళ్ల మధ్య వయసున్న మహిళలందరూ ప్రతి నెలా రూ.1,500 ఎప్పుడు అందుతుందోనని ఆశగా ఎదురుచూస్తున్నారు. 13 నెలలు గడుస్తున్నా సీఎం చంద్రబాబు దాని ఊసే ఎత్తడంలేదు. ఈ పరిస్థితుల్లో మంత్రి అచ్చెన్న చేసిన వ్యాఖ్యలు మహిళల్లో మరింత కలవరపాటుకు గురి చేసింది. ఎన్నికల హామీ అమలు చేయాలి.

– శారద, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షురాలు, రాయదుర్గం

ఆడబిడ్డ నిధి ఎప్పుడిస్తారో?



ఆడబిడ్డ నిధి కింద రూ.1,500 ఎప్పుడు జమ చేస్తారో ప్రకటించాలి. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాల్లోని పేద మహిళలంతా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల్లో ఆశ చెప్పి ఇప్పుడు మాట మార్చేలా చూస్తున్నారు. మంత్రి అచ్చెన్న వ్యాఖ్యలు చూస్తే అలాగే అనిపిస్తోంది. ఇది సరైన విధానం కాదు. కచ్చితంగా ఆడబిడ్డ నిధి నగదు జమ చేయాలి.

– లక్ష్మి, గృహిణి, రాయదుర్గం

నాటుసారా విక్రయిస్తే చర్యలు



డ్రోన్ కెమెరాతో నాటుసారా కేంద్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

విడపనకల్లు: అక్రమంగా నాటుసారా తయారు చేసి, విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ ఖాజా హుస్సేన్ హెచ్చరించారు. ఆదివారం మండల కేంద్రంలో వి.కొత్తకోట గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న కొండపై నాటు సారా తయారు చేసే కేంద్రాలను గుర్తించేందుకు డ్రోన్ కెమెరాలతో పరిశీలంచారు. కొందరు ఈ కొండపై నాటుసారా తయారు చేసి, విక్రయించే వారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొండపై పోలీసులు విస్తృతంగా గాలింపులు చేపట్టారు.

'దుర్గం' వాసికి బ్రాండ్ ఆఫ్ ఇండియా అవార్డు



సినీ నటుడు అలీ, నిర్వాహకుల చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న దస్తగిరి

రాయదుర్గంటౌన్: పట్టణానికి చెందిన కొలిమి దస్తగిరి బ్రాండ్ ఆఫ్ ఇండియా అవార్డు–2025 అందుకున్నాడు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో సినీ నటుడు అలీ చేతుల మీదుగా ఫిట్‌నెస్, బాడీ బిల్డింగ్ కోచ్ విభాగంలో దస్తగిరికి అవార్డు అందించారు. దస్తగిరి ఇటీవల బెంగళూరులో జరిగిన బాడీ బిల్డింగ్‌లో దక్షిణ భారతదేశం పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు.

ఇంటింటా కూటమి పాలనపై వ్యతిరేకత

కణేకల్లు: కూటమి పాలనపై ప్రతి ఇంటా వ్యతిరేకత కనిపిస్తోంది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల కోసం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నా.. చంద్రబాబు మాత్రం వాటి ఊసే ఎత్తడంలేదని ప్రతి ఇంటా నిట్టూరుస్తున్నారు. ఆదివారం మండలంలోని 43 ఉడేగోళంలో ×బాబు ష్యూరిటీ... మోసం గ్యారెంటీ౯ కార్యక్రమం జరిగింది. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమన, ఎంపీటీసీ గోపాల్‌లు ఇంటింటా వెళ్లి కూటమి సర్కారు సూపర్ సిక్స్ పథకాల ఏ మేరకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. పింఛన్, కొందరి తల్లులకు తల్లికి వందనం తప్ప ఏ పథకం రావడం లేదని మహిళలు పేర్కొన్నారు. 18 ఏళ్ల మహిళలకు రూ.1,500, అన్నదాత సుఖీభవ, 50 ఏళ్లకు పింఛన్, ఫ్రీ బస్సు, విద్యార్థులకు వసతి దీవెన, విద్యా దీవెన పథకాలు ఇవ్వడం లేదన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆంజనేయులు, శ్రీనివాసులు, రామాంజి, లాలుస్వామి, వివిధ అనుబంధ సంఘాల నేతలు హళ్లి నాగరాజు, కురుబ తేజ, యంత్రకాయల వన్నూరప్ప, కెంగుట రామిరెడ్డి, హనుమంతు, కురుబ లోకేష్‌గౌడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చిక్కణ్ణ తదితరులు పాల్గొన్నారు.

టమాట రైతుకు తెగుళ్ల బెడద

కూడేరు: దిగుబడితోపాటు ధర ఆశించిన స్థాయిలో ఉంటుందని టమాట సాగు చేస్తే తీరా చేతికందివచ్చేలోపు తెగుళ్ల బెడద పట్టుకుంది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండలంలోని జల్లిపల్లి, చోళసముద్రం, ఇప్పేరు, కూడేరు, ఉదిరిపికొండ, కొర్రకోడు, ముద్దలాపురం, ఉదిరిపికొండ, మరుట్ల, అంతరగంగ, కమ్మూరు, గొటుకూరు, పి.నారాయణపురం, తిమ్మాపురం, కడదరకుంట, జయపురం, కరుట్లపల్లి, కలగళ్లతో పాటు మరికొన్ని గ్రామాల్లో సుమారు 600 ఎకరాల్లో టమాట పంట సాగు చేశారు. అందులో మంచి దిగుబడినిచ్చే సాహో, నంది, చాంపియన్, సాహితి, 448 రకాలను అధిక పెట్టుబడి పెట్టి సాగు చేశారు. సూర్యరశ్మి ప్రభావం తగ్గిపోవడం, రోజు తేలిక పాటికగా చినుకులు పడుతుండడంతో టమాట పంటకు కొమ్ము, కాయ మచ్చ తెగులు, బూడిద తెగులు ఆశించి, పూత రాలిపోతోంది. పూత బాగా పూస్తే దిగుబడి బాగుంటుంది. కాయలకు మచ్చలు వస్తే నాణ్యత లోపిస్తుంది. మార్కెట్లో టమాటకు మంచి ధర పలుకుతోంది. 15 కేజీల బాక్స్ కాయ నాణ్యత బట్టి రూ.350 నుంచి రూ.450 అమ్ముడుపోతోంది. రేటు బాగుంది, ఆదాయాన్ని పొందుదామనుకున్న రైతుల ఆశలపై తెగుళ్లు నీళ్లు చల్లుతున్నాయి.



చోళసముద్రంలో తెగుళ్లతో దెబ్బతిన్న టమాట పంట

కుందుర్పమ్మను దర్శించుకున్న తలారి రంగయ్య



వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎంపీ రంగయ్య

కుందుర్పి: స్థానిక కుందుర్పమ్మ అమ్మవారిని మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆదివారం దర్శించుకున్నారు. మండల కేంద్రానికి చెందిన సర్పంచు రామ్మూర్తి సోదరుడి కుమారుడు వెంకటేస్ వివాహానికి తలారి రంగయ్య హాజరై, వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కుందుర్పమ్మ కొండను సందర్శించి, అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, ఎంపీపీ నాగరాజు, సర్పంచ్ రామూర్తి, మండల కన్వీనర్ హనుమంతరాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ఈరన్న, రాజగోపాల్, నాయకులు పాలాక్షి పాల్గొన్నారు.

ఎస్సీలు ఉన్నతంగా చదువుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: ఎస్సీలు ఉన్నతంగా చదువుకోవాలని మాదిగ ఉద్యోగుల సమైఖ్య ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి బిక్షా పేరొన్నారు. ఆదివారం పట్టణంలోని కేజీబీ హైస్కూల్‌లో ఎస్సీ ఉద్యోగుల సదస్సు భాగంగా ఎస్సీ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. అనంతరం మాదిగ ఉద్యోగులు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ 30 ఏళ్ల పాటు వర్గీకణ కోసం ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ పోరాటం చేసి సాధించారన్నారు. మాదిగ ఉద్యోగులు ఎంఈఎఫ్‌లో సభ్యత్వం పొందాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమంతురావు, ఎంఆర్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్, దళిత ఉద్యోగులు లక్ష్మన్న, రవిశంకర్, ఎర్రిస్వామి, మహేష్, నాగరాజు, హరికృష్ణ పాల్గొన్నారు.

నేడు మంజునాథస్వామి ఆరాధనోత్సవం

బెళుగుప్ప: మండల కేంద్రంలోని మంజునాథస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించనున్న 51వ ఆరాధనోత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయం చుట్టూ శివస్వరూప దైవమూర్తుల శిల్పాలకు రంగులను వేసి నూతన శోభతో ఆరాధనోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయం పక్కనే అశ్వర్థనారాయణస్వామి, నాగదేవతల కట్టను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆరాధన ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం తెల్లవారుజాము నుంచి సుప్రభాతసేవతో మొదలై మహాగణపతిపూజ, అశ్వర్థనారాయణ, నాగదేవతలకు తొలుతగా పంచామృతాభిషేకాలు తదనంతరం గౌరీసమేత మంజునాథస్వామి వారికి ఏకవార పంచామృత, రసాభిషేకాలు, బిల్వార్చన పూజలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు స్వామి ఆరాధన రథోత్సవం నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా మధ్యాహ్నం అన్నదానం, రాత్రికి భజనలను నిర్వహించనున్నట్లు సేవా కమిటీ సభ్యులు తెలిపారు.



మంజునాథస్వామి మూలవిరాట్

తిమ్మాపురం ఆలయంలో చోరీ

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండలం తిమ్మాపురం సమీపంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దుండగులు హుండీని ధ్వంసం చేసి, అందులోని నగదును ఎత్తుకెళ్లారు. ఈ ఘటన ఆదివారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన మేరకు.. ఉదయం ఆలయం వద్దకు శ్రావణమాసం సందర్భంగా పూజలు చేసేందుకు అర్చకుడు వెళ్లగా..ఆలయంలోని హుండీ ధ్వంసమై ఉండడాన్ని గమనించాడు. వెంటనే గ్రామస్తులు, పోలీసులకు సమాచారం అందించారు. పోలీసుల ఘటనా స్థలాన్ని పరిశీలించి, దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీరు వృథా



కలగళ్ల రోడ్డు క్రాస్‌లో వృథా అవుతున్న నీరు

కూడేరు: మండల కేంద్రంలో కలగళ్ల రోడ్డు క్రాస్‌లో పంచాయతీ తాగునీటి పథకం పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి పదిరోజులుగా నీరు వృథాగా పోతోంది. నీరు లీకేజీతో పెద్ద అక్కడ గుంత ఏర్పడింది. పైపులైన్ గుండా నీటి సరఫరా బంద్‌అయినప్పుడు గుంతలోని ఒండు నీరు పైపులోకి చేరి కలుషితమయ్యే అవకాశం ఉంది. మరోవైపు అపరిశుభ్రతతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

అంగరంగ వైభవం..వీరభద్రస్వామి బ్రహ్మోత్సవం

- ప్రారంభమైన ఉండబండ ఉత్సవాలు
- ఆగస్టు 30న రథోత్సవం

విడపనకల్లు: మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఉండబండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఈనెల 26 నుంచి ఆగస్టు 30 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శేషవాహనం, 28న మయూరి వాహనం 29న నంది వాహనం, 30న వీరభద్రస్వామి రథోత్సవం 31న లంకాదహనం ఉంటుందని ఈఓ తెలిపారు.

ఆహ్లాదకర వాతావరణం


వీరభద్రస్వామి ఆలయం ప్రాంగణంతో ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. అంతేకాకుండా వీరభద్రస్వామి ఆలయం పాల్తూరు గ్రామానికి 2 కిలో మీటర్ల దూరంలో ఒక కొండకు ఆనుకొని దాదాపు 7 ఎకరాల్లో నిర్మించారు. ఆలయం కొండకు ఆనుకొని ఉండటంతో ఎంతో ఆహ్లాదకర వాతావారణం కనిపిస్తుంది.



వీరభద్రస్వామి ఆలయం

ఆలయానికి ఆనుకొని ఉన్న కొండెక్కి చూస్తే చుట్టూ కూడా పచ్చటి పొలాలు కనువిందు చేస్తాయి.

ఆలయానికి ఎలా వెళ్లాలంటే...: జిల్లా కేంద్రమైన అనంతపురం మీదుగా వెళ్లే భక్తులు ఉరవకొండకు వెళ్తే అక్కడి నుంచి ప్రతి 20 నిమిషాలకు పాల్తూరుకు వెళ్లే బస్సులు, ఆటోలు పట్టుకొని వెళ్లొచ్చు. లేదా బళ్లారి నుంచి రూపనగుడి మీదుగా హావళిగి, పాల్తూరు మీదుగా ఉండబండ వైపు వచ్చే బస్సు, ఆటోల్లో వెళ్తే ఆలయానికి గంటలో చేరుకోవచ్చు.



శేషవాహనంపై వీరభద్రస్వామి, కాళికాదేవి

శేషవాహనంపై విహరించిన వీరభద్రస్వామి

ప్రసిద్ధి చెందిన ఉండబండ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వీరభద్రస్వామి,కాళికాదేవి శేషవాహనంపై ఆదివారం విహరిస్తూ భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అధికారులు, ఈఓ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో అలంకరించిన శేషవాహనం ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించారు. నవగ్రహ పూజ , దేవతాహోమం , వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సిబ్బంది పురుషోత్తం, మంజునాథ్ , బ్రహ్మోత్సవాల కమిటీ సభ్యులు రుద్రప్ప, శశిధర్‌గౌడు, తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మెట్టు గోవిందరెడ్డి

బొమ్మనహాళ్: మండలంలోని సిద్దరాంపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రుద్రన్న కుమారుడు మల్లికార్జున, రాధ వివాహ వేడుకలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి పాల్గొన్నారు. ఆదివారం ఉంతకల్లు రుక్మిణీ పాండురంగస్వామి కల్యాణ మంటపంలో జరిగిన వివాహానికి ఆయన హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నాయకులు సూర్యప్రతాప్‌రెడ్డి, డాక్టర్ బసప్ప, ఫొటో బసవరాజు, వెంకటేశులు, సురేష్, మురళీమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

దాహార్తి తీర్చిన వైఎస్సార్‌సీపీ సర్పంచు



ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

ఉరవకొండ రూరల్: మండలంలోని రేణుమాకులపల్లిలో వారం రోజులుగా తాగునీరు సరఫరా కావడంలేదు. దీంతో సమస్యను గుర్తించిన వైఎస్సార్‌సీపీ సర్పంచు రామాంజనేయులు తన సొంత నిధులు ఖర్చు చేసి ఆదివారం ట్యాంకుల ద్వారా తాగునీరు సరఫరా చేయించారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట



శివాలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న వై.విశ్వేశ్వర రెడ్డి


ఉరవకొండ రూరల్: మండలంలోని నెరిమెట్ల గ్రామంలో సుంకులమ్మ దేవి, వినాయక శిలా విగ్రహాల ప్రతిష్ట, శివాలయం గోపుర కళశ స్థాపన కార్యక్రమాలు ఆదివారం వేడుకగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉరవకొండ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయాలను దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నెరిమెట్ల సర్పంచ్ యోగేందర్ రెడ్డి, రామకృష్ణ, చిన్న పర్వతప్ప, జగన్నాథ రెడ్డి, లింగప్ప, మారుతి తదితరులు పాల్గొన్నారు.

పందుల సంచారం.. ప్రబలుతున్న రోగాలు



కేబీ ప్యాలెస్ రోడ్డు నుంచి చేపలవీధికి వెళ్లే ఖాళీ స్థలంలో ఇలా...

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలో పందుల సంచారంతో రోగాలు ప్రబలుతున్నాయి. వీధుల్లోని డ్రైనేజీలు, ఖాళీ స్థలాలు, డస్ట్‌బిన్ల వద్ద పందులతో అపరిశుభ్రత నెలకొంటోంది. ఏ వార్డు, ఏ వీధిలో చూసినా పందులు సంచారం దర్శనమిస్తుంది. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు పంజా విసురుతున్న నేపథ్యంలో మందుల ద్వారా వ్యాపించి డెంగీ, మెదడు వాపు, ఇతర వ్యాధులపై ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. మున్సిపల్ పారిశుద్య విభాగం అధికారులు స్పందించి పట్టణంలో పందుల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కోటముఖ ద్వారం ముందు చెత్త కుప్పల్లో పందులు